**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**

**తేది : 16 జూలై, 2023.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి**

**విషయం : అసైన్డ్ భూముల ముసాయిదా చట్ట సవరణలో చేసిన మార్పుల్లో అభ్యంతరం గురించి, అర్హులైన పేదలందరికి భూమి,ఇళ్ళస్థలాలు ఇచ్చుట గురించి.**

**అయ్యా!**

ఈనెల 12వ తేదీన మంత్రివర్గ సమావేశంలో తర్వాత పేదలకు భూ పంపిణీ చేస్తామని ప్రకటించారు. అదే సమయంలో అసైన్డ్ భూములపై యాజమాన్యపు హక్కు కల్పిస్తామని కూడా నిర్ణయించారు. ఈ నిర్ణయంవల్ల అసైన్డ్ భూములు పొందిన నిజమైన దళితులు మరియు ఇతర పేదలకు నష్టం జరుగుతుంది. అందువల్ల మా అభ్యంతరాలను మీ దృష్టికి తీసుకురావాలని ఈ ఉత్తరం రాస్తున్నాను.

రాష్ట్రంలో అత్యధికభాగం అసైన్డ్ భూములు పేదల చేతులనుండి జారిపోయి ధనవంతులు, సంపన్నుల చేతుల్లోకి మారాయి. ఈ భూములన్నింటినీ అసలు లబ్దిదారులైన పేదలకు బదలాయించాలి. అదే విదంగా పేదలకు పంచడానికి లక్షలాది ఎకరాలు ఉన్నట్లు గతంలో కోనేరు రంగారావు భూ కమిటీ చెప్పింది. అలాగే రాష్ట్రంలో సుమారు 5 లక్షలమందికిపైగా దశాబ్దాలు తరబడి పేదలు ఇళ్ళస్థలాలు వేసుకొని పట్టాలు లేకుండా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లోనూ ఇతర అనేక కాలనీల్లో దీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ళపట్టాలు ఇవ్వాలని, దీనికోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని కోరుతున్నాను.

1954 నుండి 2002 మధ్యకాలంలో అసైన్డ్ భూమి పొందిన సుమారు 15 లక్షల 21వేల మందికి 27 లక్షల 41 వేల ఎకరాలకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. కానీ 1977కి ముందు దళితులు, ఇతర పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు భూస్వాములు, పెత్తందార్లు, పలుకుబడి కల్గినవారు బినామీ పేర్లతోనూ, పేదలకు డబ్బు ఆశ చూపి లేదా కొద్దో, గొప్పో అప్పులు ఇచ్చి, అదిగాక పోతే అదిరించి, బెదిరించి అసైన్డ్ భూములు పొందారు. ఈ కారణంగా దళితుల్లో భూమి లేకుండా పోవడం వల్లే దీనిని అరికట్టి దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూముల రక్షణ కోసం 9/77 చట్టం వచ్చిన విషయం మీకు తెలియంది కాదు. ఈ చట్టం అమల్లో ఉండగానే ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 25 లక్షల ఎకరాలు దళితులకు చెందిన అసైన్డ్ భూమి అనర్హుల చేతుల్లోకి వెళ్ళినట్లు వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వ హయాంలో నియమించిన కోనేరు రంగారావు భూ కమిటి నివేదిక ఇచ్చింది. అందువల్ల ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం పేదలకు తోడ్పడేది కాదు. పేదల నుండి భూములు పొందిన సంపన్నులకే ఈ యాజమాన్యపు హక్కులు పోతాయి. అందువలన ప్రభుత్వ నిర్ణయాన్ని పున:పరిశీలించాలి. ఈ సమస్యపై నియమించిన ధర్మాన ప్రసాదరావు కమిటీ నివేదికను బహిరంగపర్చి కోరుతున్నాను.అన్ని పక్షాల అభిప్రాయాలను తీసుకోవాలని కోరుతున్నాను.

ఈ నివేదిక ఆధారంగానే 2006 మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో “తెలిసో తెలియకో మా నాన్న రాజారెడ్డి గారు కూడా దళితుల చేతుల్లో ఉన్న 300 ఎకరాలు అసైన్డ్ భూములు పొందారు. వాటిని వెంటనే వెనక్కి ఇస్తామని” ప్రకటించారు. ప్రధాన ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు గారు కూడా నెల్లూరు జిల్లా బాలాయిపాలెం మండలంలో 1500 ఎకరాల

**.... 2వ పేజీ**

అసైన్డ్ భూమి పొందినట్లు చెప్పారు. ఇవే కాక రాష్ట్రంలో అనేకమంది భూస్వాముల దగ్గర అక్రమంగా లక్షలాది ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. ఈ భూములన్ని వెనక్కి ఇప్పిస్తామని కూడా రాజశేఖర్ రెడ్డి గారు ప్రకటించారు. చట్టం ఉన్నప్పటికీ 25 లక్షల ఎకరాల దళితులకు చెందిన అసైన్డ్ భూమి అన్యాక్రాంతం అయ్యింది. తమ భూముల పరిరక్షణ కోసం దళితులు, ఇతర పేదలు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసుకొని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అనేక కేంద్రాలలో 12 లక్షల ఎకరాల్లో పేదలు సంఘటితపడి భూములకోసం పోరాడుతున్నారు. న్యాయస్థానాల్లో సైతం భూవివాదాలున్నాయి. ప్రభుత్వం పేదల పక్షంలో నిలబడి ఈ భూములు తిరిగి పొందేందుకు సహకరించాలి.

భూమి లేని పేదలకు 54వేల ఎకరాలకు పైగా పంపిణీ చేస్తామని మీ ప్రభుత్వం ప్రకటించాడాన్ని ఆహ్వానిస్తున్నాము. కాని పేదలకు పంచడానికి ప్రభుత్వ భూములతో పాటు 16 రకాల భూములు సుమారు 25 లక్షల ఎకరాలకు పైగా ఉన్నట్లు కోనేరు రంగారావు కమిటీతో పాటు ప్రభుత్వ నివేదికలు కూడా చెప్తున్నాయి. ఈ భూముల్ని కూడా పంచాలి.

ఇదే అమలు జరిగితే రానున్నకాలంలో దళితుల చేతుల్లో ఒక సెంటు భూమి కూడా మిగలదు.

<u>**ఇళ్ళ స్థలాలకు పట్టాలివాలి :**</u> రాష్ట్రంలో పేదలు సుమారు 4 నుండి 5 లక్షల మంది ప్రభుత్వ కాల్వగట్టు, రహదారుల ప్రక్కన గ్రామ కంఠం, ఇతర స్థలాల్లో గుడిసెలు, నివాసాలు ఏర్పరుచుకొని జీవనం సాగిస్తున్నారు. వీరు హక్కులు కల్పించమని పట్టాలిప్పించమని ప్రభుత్వాలను కోరుతున్నారు. కాబట్టి అర్హులందర్ని గుర్తించి తక్షణమే నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి, వారికి ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుచున్నాము. ఇప్పటికే నివాసముంటున్నవారిని ఖాళీ చేయించి జగనన్న కాలనీలకు వెళ్ళాలని అధికారులు పలుచోట్ల బలవంతం చేస్తున్నారు. దీనిని తక్షణం ఆపాలి. విడిపోయిన కుటుంబాలు, కొత్తగా పెళ్ళయిన వారికి జగనన్న కాలనీలలో వసతి కల్పించాలి. ఇప్పటికే నివాసం ఉంటున్నవారికి వారున్నచోటనే పట్టాలు ఇవ్వాలని కోరుతున్నాను.

పేదల అభ్యున్నతి కోసం ఈ క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

1. **అసైన్డ్ భూముల రక్షణ కోసం తెచ్చిన పిఓటి యాక్ట్ (9/77) చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలి.**

2. **ఒక వేళ భూమి పొందిన దళితులు, ఇతర పేదలు తమ అవసరాల కోసం అమ్ముకో దలిచితే 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేసి అదే గ్రామంలోని ఇతర భూమిలేని వారికి,పేద రైతులు, కౌలుదారులకు పంచాలి.**

3. **రాష్ట్రంలో పేదలకు భూ పంపిణీ కోసం అవకాశం ఉన్న అన్ని రకాల భూములను గుర్తించి అసైన్డ్‌మెంట్ కమిటీల ద్వారా పేదలను గుర్తించి భూ పంపిణీ చేయాలి.**

4. **రెండున్నర ఎకరాల మాగాణీ లేదా ఐదు ఎకరాల మెట్ట లోపు ఉన్న దళితులు, ఇతర పేదలు అసైన్‌మెంటు భూమి కలిగి ఉంటే అలాంటి వారికి లేదా వారి వారసులకు పట్టాలు ఇవ్వాలి.**

5. **కోనేరు రంగారావు భూ కమిటి నివేదిక ప్రకారం ఇప్పటికే 5 ఎకరాలు పైన అసైన్డ్ భూములు అక్రమంగా అనుభవిస్తున్న వారి చేతిలో ఉన్న భూమిని వెనక్కి తీసుకొని అదే గ్రామంలో పేదలకు పంపిణీ చేయాలి.**

6. **ఇళ్ళ స్థలాలకు పట్టాలివ్వాలని కోరుతున్న అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయాలి.**

పై సమస్యలన్ని పరిష్కారం కోసం కృషి చేస్తారని ఆశిస్తూ...

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**

రాష్ట్ర కార్యదర్శి